క్లుప్తంగా

నేడు విద్యుత్‌కు అంతరాయం

సిద్దిపేటరూరల్: 11కేవీ విద్యుత్ లైన్ మరమ్మతుల కారణంగా సోమవారం మండల పరిధిలోని ఇర్కోడ్ గ్రామంతోపాటు పరిశ్రమలకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఏఈ శ్రీధర్‌రెడ్డి ఆదివారం ఒకప్రకటనలో తెలిపారు. ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 1గంట వరకు విద్యుత్ నిలిపివేస్తామని, వినియోగదారులు సహకరించాలని కోరారు.

ట్రాక్టర్ బ్యాటరీల చోరీ

మద్దూరు(హుస్నాబాద్): మండలంలో కొన్ని రోజులుగా ట్రాక్టర్ బ్యాటరీలు చోరీకి గురవుతున్నాయి. వ్యవసాయ బావులు, ఇళ్ల వద్ద నిలిపిన ట్రాక్టర్‌ల బ్యాటరీలను రాత్రి వేళల్లో దొంగలు అపహరిస్తున్నారు. ఈనెల 8న మండల కేంద్రంలో ఒకటి, వల్లంపట్లలో ఒకటి, రేబర్తిలో మూడు; అలాగే 26న సలాఖపూర్‌లో 5, ధర్మారంలో ఒక బ్యాటరీ మాయం కాగా రేబర్తిలో ఆదివారం మూడు బ్యాటరీలను దొంగలు ఎత్తుకెళ్లారు. దీంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. రాత్రి వేళల్లో పోలీసులు పెట్రోలింగ్ నిర్వహించాలని, గ్రామంలో సీసీ కెమేరాలు ఏర్పాటు చేయాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.

పీఆర్టీయూ జిల్లా ఉపాధ్యక్షుడిగా రాంబాబు


రాంబాబు

తొగుట(దుబ్బాక): పీఆర్టీయూ జిల్లా ఉపాధ్యక్షుడిగా సాయిరి రాంబాబు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఉపాధ్యాయ ఎమ్మెల్సీ కూర రఘోత్తంరెడ్డి సమక్షంలో ఆదివారం ఈ ఎన్నిక జరిగింది. ఈ సందర్భంగా రాంబాబు మాట్లాడుతూ ఉపాధ్యాయ సమస్యలను పరిష్కరించడానికి కృషి చేస్తానన్నారు.

ముగిసిన శిక్షణ శిబిరం


శిక్షకులను సన్మానిస్తున్న విశ్వకర్మలు

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): నేషనల్ స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో సిద్దిపేటలో వారం రోజులుగా నిర్వహించిన ప్రధాన మంత్రి విశ్వకర్మ శిక్షణ కార్యక్రమం ఆదివారంతో ముగిసింది. శిక్షణ కేంద్రం అధిపతి విజయకాంత్ ఆధ్వర్యంలో వడ్ల అనిల్‌కుమార్, బార్గవి, స్రవంతి, శేఖర్ శిక్షణ అందించారు. ముగింపు కార్యక్రమానికి విశ్వబ్రాహ్మణ, విశ్వకర్మ ఐక్య సంఘం నాయకులు సాయన్నగారి శ్రీనివాసాచారి, నరసింహాచారి, రమేశ్, యాదగిరి, సుదర్శనం, తేజ, రాజయ్య శిక్షణఇచ్చిన వారిని సన్మానించారు.

సభ్యత్వ లక్ష్యాన్ని పూర్తిచేయండి


సమావేశంలో పాల్గొన్న బీజేపీ నాయకులు

ములుగు(గజ్వేల్): బీజేపీ సభ్యత్వ నమోదు లక్ష్యాన్ని విజయవంతం చేయాలని నియోజకవర్గ సభ్యత్వ నమోదు ఇన్‌చార్జి కోదండం శ్రీనివాస్‌రెడ్డి, జిల్లా ఉపాధ్యక్షుడు కుడికల రాములు పిలుపునిచ్చారు. ములుగు మండలం వంటిమామిడిలో పార్టీ మండల అధ్యక్షుడు మన్నె శ్రీనివాస్ అధ్యక్షతన ఆదివారం నిర్వహించిన పార్టీ ముఖ్య కార్యకర్తల సమావేశంలో వారు పాల్గొని మాట్లాడారు. గ్రామాల్లోని ప్రతి బూత్ నుంచి కార్యకర్తలు రెండు వందల సభ్యత్వాలను పూర్తిచేయాలని సూచించారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో అభ్యర్థుల గెలుపుకోసం కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు శ్రీకాంత్ రెడ్డి, సత్యనారాయణ యాదవ్, నర్సింహులు ముదిరాజ్, ఏలేందర్‌రెడ్డి, మహేశ్, భాస్కర్, హరికృష్ణ, నవీన్, అశోక్ పాల్గొన్నారు.

సైనిక వెల్ఫేర్ అసోసియేషన్ నూతన కమిటీ ఎంపిక


ఎంపికైన నూతన కమిటీ సభ్యులు

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): జిల్లా సైనిక వెల్ఫేర్ అసోసియేషన్ కమిటీ కార్యవర్గ సభ్యులను ఆదివారం ఏకగ్రీవంగా ఎంపిక చేశారు. స్థానిక అభయజ్యోతి మనోవికాస కేంద్రంలో ఆదివారం జిల్లా కార్యవర్గ సభ్యుల సమావేశం నిర్వహించారు. అనంతరం తాత్కాలిక సైనిక వెల్ఫేర్ అసోసియేషన్ కమిటీని ఎంపికచేశారు. జిల్లా అధ్యక్షుడుగా సురేందర్ రెడ్డి, ఉపాధ్యక్షులుగా మల్లికార్జున్, ప్రధాన కార్యదర్శిగా రాంరెడ్డి, సంయుక్త కార్యదర్శులుగా సైకిలాబ్ రెడ్డి, చంద్రం, కోశాధికారిగా జోజి, వెంకట్ రాం రెడ్డి, బాలరాజు, సురేశ్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ఇలా.. ప్రయాణం ఎలా


అధ్వానంగా మారిన అల్వాల-మెట్టు రోడ్డు

అసలే గుంతల రోడ్డు. ఆపై కాస్త వర్షాలు పడితే చాలు. ఇక ఆ రోడ్డు గుండా ప్రయాణించే వారి సహనానికి ప్రరీక్షే. మండల పరిధిలోని అల్వాల-మెట్టు రోడ్డు ధ్వంసం కావడంతో ప్రయాణికులకు ఇబ్బందులు తప్పడం లేదు. దారి పొడవునా అడుగడుగునా గుంతలు దర్శనమిస్తున్నాయి. దీంతో వాహనదారులు నిత్యం ప్రమాదాలకు గురవుతున్నారు. రోడ్డు మరమ్మతులకు నిధులు మంజూరైనా యేళ్ల తరబడి రోడ్డుకు మోక్షం లభించడం లేదని స్థానికులు మండిపడుతున్నారు. మరమ్మతులు చేపట్టాలని ఇటీవల అల్వాల జేఏసీ ఆధ్వర్యంలో కలెక్టరేట్ వరకు పాదయాత్ర నిర్వహించి విన్నవించినా ఫలితం లేదని గ్రామస్తులు అహనం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి రోడ్డుకు మోక్షం కల్పించాలని కోరుతున్నారు.

– మిరుదొడ్డి(దుబ్బాక):

కొనసాగుతున్న రహదారి విస్తరణ


చిన్నకోడూరు వద్ద రోడ్డు దుస్థితి

సిద్దిపేట నుంచి చిన్నకోడూరు వరకు 8కిలో మీటర్ల మేర జరుగుతున్న రోడ్డు విస్తరణ పనులు నత్త నడకన సాగుతున్నాయి. పనులు ప్రారంభించి 17నెలలు దాటుతున్నా పనులు పూర్తి స్థాయిలో పూర్తి కాకపోవడంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. నిత్యం ప్రమాదాల బారిన పడుతున్నారు. దుమ్ము లేవకుండా ట్యాంకర్లతో నీటిని పట్టించాలని ప్రజలు మొరపెట్టుకున్నా ఫలితం లేదు. పనుల్లో నాణ్యతా ప్రమాణాలు కూడా పాటించడం లేదని పలువురు ఆరోపిస్తున్నారు. అధికారుల పర్యవేక్షణ లేకపోవడంతో కాంట్రాక్టరు తన ఇష్టానుసారంగా పనులు నిర్వహిస్తున్నారని ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి త్వరగా పనులు పూర్తిచేయించాలని ప్రజలు కోరుతున్నారు.

– చిన్నకోడూరు(సిద్దిపేట):

గ్రామాల అభివృద్ధి కాంగ్రెస్‌తోనే సాధ్యం

నియోజకవర్గ ఇన్‌చార్జి హరికృష్ణ


బోరు పనులు ప్రారంభించిన హరికృష్ణ

సిద్దిపేటరూరల్: కాంగ్రెస్ పాలనలోనే గ్రామాలన్నీ అభివృద్ధి పథంలో ముందుకు సాగుతున్నాయని ఆ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి పూజల హరికృష్ణ అన్నారు. మండల పరిధిలోని చిన్నగుండవెల్లిలోని ఎస్సీ కాలనీలో బోరుబావి పనులను ఆదివారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీల్లో భాగంగా ప్రభుత్వం ఏర్పాటైన 30రోజుల్లోనే ఆడపడుచులు బతుకమ్మ ఆడేందుకుగాను అనువుగా సీసీ రోడ్డు నిర్మించారన్నారు. అదేవిధంగా రెడ్డి కమ్యూనిటీ భవనం కోసం రూ.10లక్షలు మంజూరు చేసి పనులు ప్రారంభించామని చెప్పారు. నీటి కొరత విషయాన్ని కాలనీవాసులు చెప్పారని అప్పుడు ఇచ్చిన హామీలో భాగంగా నేడు పనులు ప్రారంభించడం సంతోషంగా ఉందన్నారు. అలాగే త్వరలోనే ఫంక్షన్ హాల్ నిర్మించేందుకు కృషిచేస్తానని హామీ ఇచ్చారు. అనంతరం కాలనీవాసులు ఆయను శాలువాతో సన్మానించారు. కార్యక్రమంలో నాయకులు రాములు, అంజిరెడ్డి, మహిపాల్ రెడ్డి, పద్మారెడ్డి, సదాశివారెడ్డి, కనకయ్య, లక్ష్మి, బాబేశ్, అత్తు, కలిం, భూపతి, నర్సయ్య, దుర్గయ్య, మురళీ, బాబు, రవి తదితరులు పాల్గొన్నారు.

పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలి

మున్సిపల్ చైర్‌పర్సన్ రజిత


పరిసరాలను శుభ్రం చేస్తున్న రజిత తదితరులు

హుస్నాబాద్: ఆలయ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని మున్సిపల్ చైర్‌పర్సన్ రజిత సూచించారు. స్వచ్ఛతాహీ సేవా కార్యక్రమంలో భాగంగా పట్టణంలోని 6వ వార్డులో ఎల్లమ్మ దేవాలయ పరిసరాలు, మూత్రశాలల పరిసర ప్రాంతాలను ఆదివారం శుభ్రం చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఆలయానికి వచ్చే భక్తులు పరిసర ప్రాంతాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. బహిరంగ మలమూత్ర విసర్జన చేయవద్దని, మూత్రశాలలను వినియోగించుకోవాలని సూచించారు. స్వచ్ఛ పట్టణంగా తీర్చిదిద్దడంలో ప్రజలు భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో కౌన్సిలర్ పున్న లావణ్య సది, పర్యావరణ అధికారి రవికుమార్ పాల్గొన్నారు.

వ్యక్తిగత శుభ్రత పాటించాలి

దుబ్బాకటౌన్: వ్యక్తిగత శుభ్రతతోపాటు పరిసరాల పరిశుభ్రత పాటిస్తేనే ఆరోగ్యంగా ఉంటామని పదో వార్డు కౌన్సిలర్ బంగారయ్య అన్నారు. వార్డులో ఇటీవల కురిసిన వర్షాలకు దోమల ఉధృతి పెరిగింది. దీంతో ఆయన సిబ్బందితో ఆదివారం దోమల నివారణ మందును పిచికారీ చేయించారు.

బీఆర్‌ఎస్‌కు బుద్ధి చెప్తాం

కాంగ్రెస్ నేతలు


మాట్లాడుతున్న కాంగ్రెస్ నాయకులు

గజ్వేల్‌రూరల్: నిర్వాసితులకు అప్పట్లో కాంగ్రెస్‌తోనే న్యాయం జరిగిందని, ఇప్పుడు బీఆర్ఎస్ నేత హరీశ్‌రావు మొసలి కన్నీరు కారుస్తున్నారని నియోజకవర్గ యువజన కాంగ్రెస్ మాజీ అధ్యక్షుడు భానుప్రకాశ్‌రావు, మాజీ ఎంపీపీ వెంకట్రామ్‌రెడ్డి, మండల అధ్యక్షుడు మల్లారెడ్డి యద్దేవా చేశారు. మల్లన్నసాగర్, కొండపోచమ్మసాగర్ నిర్వాసితులతో ఆదివారం కలిసి అనంతరం మాట్లాడుతూ అప్పట్లో రేవంత్‌రెడ్డి, దామోదర రాజనర్సింహ కిష్టాపూర్‌లో చేసిన దీక్ష ఫలితంగానే నిర్వాసితులకు న్యాయం జరిగిందన్నారు. తెలంగాణ భవనాన్ని ముట్టడించి హరీశ్‌రావుకు తగిన బుద్ధి చెప్తామని హెచ్చరించారు. 26 ప్రశ్నలకు సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. సమావేశంలో పోచయ్య, శ్రీనివాస్ రెడ్డి, రాజు, చంద్రం, అనిల్‌రెడ్డి, బాబు తదితరులు పాల్గొన్నారు.

సెల్‌ఫోన్లు అందజేత


సెల్‌ఫోన్లు అందజేస్తున్న సీఐ ఉపేందర్

సిద్దిపేటకమాన్: పోగొట్టుకున్న సెల్‌ఫోన్‌లను పోలీసులు నూతన టెక్నాలజీ సాయంతో గుర్తించి బాధితులకు అందజేశారు. టూటౌన్ సీఐ ఉపేందర్ తెలిపిన వివరాల ప్రకారం పట్టణానికి చెందిన ఐదుగురు కొద్ది రోజుల క్రితం తమసెల్‌ఫోన్‌లను పోగొట్టుకున్నట్లు పోలీసులకు ఫిర్యాదు చేశారు. సీఈఐఆర్ యాప్ సాయంతో సెల్‌ఫోన్‌లను గుర్తించి ఆదివారం బాధితులకు అందజేసినట్లు సీఐ తెలిపారు.

నీటి తరలింపు నిలిపివేయండి

మున్సిపల్ చైర్‌పర్సన్ స్వరూపరాణి


చేర్యాల(సిద్దిపేట):మాట్లాడుతున్న స్వరూపరాణి

చేర్యాల(సిద్దిపేట): కొమురవెల్లి మండల పరిధిలోని తపాసుపల్లి రిజర్వాయర్ నుంచి నీటి తరలింపు నిలిపి వేయాలని మున్సిపల్ చైర్‌పర్సన్ అంకుగారి స్వరూపరాణి అన్నారు. పట్టణంలో వైస్ చైర్మన్ నిమ్మ రాజీవ్‌రెడ్డితో కలిసి ఆదివారం ఆమె మాట్లాడుతూ చేర్యాల ప్రాంతంలోని చెరువులన్నింటినీ గత ప్రభుత్వ హయాంలో తపాసుపల్లి రిజర్వాయర్ నీటితో నింపడం ద్వారా పంటలు బాగా పండాయన్నారు. ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం నీటిని పక్క నియోజకవర్గమైన ఆలేరుకు తరలించేందుకు అక్కడి ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య ప్రయత్నం చేయడం సబబుకాదని చెప్పారు. ఈ ప్రాంతంలోని చెరువులను నింపిన తర్వాత ఇతర ప్రాంతాలకు నీటిని విడుదల చేయాలని డిమాండ్ చేశారు. సమావేశంలో నాయకులు నాగేశ్వర్‌రావు, మల్లేశం, అంజయ్య, తిరుపతి, ఇన్నారెడ్డి, సిద్ధిలింగం, రామచంద్రం, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

ఊరుకునేది లేదు

మద్దూరు(హుస్నాబాద్): చేర్యాల ప్రాంతంలోని చెరువులకు నీటిని విడుదల చేయకుండా తపాస్‌పల్లి రిజర్వాయర్ నీటిని ఇతర ప్రాంతాలకు తరలిస్తే ఊరుకునేది లేదని బీఆర్ఎస్ పార్టీ మద్దూరు, దూళ్మిట్ట మండల అధ్యక్షులు మేక సంతోష్‌కుమార్, మంద యాదగిరి హెచ్చరించారు. ఆదివారం వారు మాట్లాడుతూ తపాస్‌పల్లి రిజర్వాయర్ నుంచి ఆలేరు నియోజకవర్గానికి గోదావరి జలాలు తీసుకెళ్లేందుకు ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య చేస్తున్న ప్రయత్నాలు మానుకోవాలన్నారు. నీళ్లలేక పొలాలు ఎండిపోతున్నా చెరువులు, కుంటలు నింపకుండా ప్రభుత్వం చోద్యం చూస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. నీటి తరలింపును ఆపకపోతే రైతులతో కలిసి అడ్డుకుంటామని వారు హెచ్చరించారు. మాజీ వైస్ ఎంపీపీ సుమలతమల్లేశం, మాజీ సర్పంచ్‌లు దీపికవేణుగోపాల్‌రెడ్డి, రాజమల్లయ్య, అరుణ తదితరులు పాల్గొన్నారు.

చదువుతోనే సమాజంలో గౌరవం


వెంకటయ్యను సన్మానిస్తున్న వ్యవస్థాపకులు

ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ వెంకటయ్య

సిద్దిపేటకమాన్: చదువుతోనే సమాజంలో గౌరవం ఉంటుందని ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య అన్నారు. సిద్దిపేట ప్రెస్‌క్లబ్‌లో షెడ్యూల్ క్యాస్ట్ ఎడ్యుకేషనల్ సొసైటీ ఆధ్వర్యంలో ఆదివారం ఆయనకు ఆత్మీయ సన్మాన కార్యక్రమం నిర్వహించారు. మున్సిపల్ చైర్‌పర్సన్ మంజులరాజనర్సు, టీఎన్‌జీఓ జిల్లా అధ్యక్షుడు గ్యాదరి పరమేశ్వర్‌తో కలిసి వెంకటయ్య మాట్లాడారు. ఎస్సీ, ఎస్టీలకు రాష్ట్రంలో ఎక్కడ అన్యాయం జరిగినా తనకు వాట్సప్ మెసేజ్ పెడితే వెంటనే న్యాయం చేస్తానని హామీ ఇచ్చారు. చదువు ప్రాముఖ్యత తెలియని ఆ రోజుల్లోనే ఎడ్యుకేషనల్ సొసైటీని ఏర్పాటు చేయడం గొప్ప కార్యక్రమం అని వ్యవస్థాపకులు మహంకాళి, నారాయణ, రాములును అభినందిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో నర్సింహులు, మల్లేశం, శంకర్ తదితరులు పాల్గొన్నారు.

అ'పూర్వ'సమ్మేళనం


తొగుట(దుబ్బాక): 1992-93బ్యాచ్ విద్యార్థులు


కోహెడలో గురువులను సన్మానిస్తున్న పూర్వవిద్యార్థులు


ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): 1986-87బ్యాచ్ విద్యార్థులు

తొగుట(దుబ్బాక)/కోహెడ(హుస్నాబాద్)/ప్రశాంత్‌నగర్(సిద్దిపేట)/గజ్వేల్‌రూరల్: తొగుట మండల కేంద్రంలో 1992–93లో పదో తరగతి చదివిన విద్యార్థులు ఆదివారం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. 31 సంవత్సరాల తర్వాత కలిసి సందడిగా గడిపారు. తమకు విద్యా బుద్ధులు నేర్పిన గురువులను ఘనంగా సన్మానించారు. అదేవిధంగా కోహెడ మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలకు చెందిన 1998–99బ్యాచ్ పూర్వ విద్యార్థులు స్థానిక లక్ష్మీ గార్డెన్‌లో సందడి చేశారు. ఆ నాటి గురువులు నారాయణరెడ్డి, బాలయ్య, చంద్రారెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, జాకీర్‌హుస్సేన్, అబ్దుల్‌వహాబ్, లక్ష్మారెడ్డిని శాలువాలతో ఘనంగా సన్మానించారు. సిద్దిపేట రూరల్ మండల పరిధిలోని పుల్లూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 1986–87బ్యాచ్ పదోతరగతి విద్యార్థులు సమ్మేళనం సిద్దిపేటలో నిర్వహించారు. అదేవిధంగా గజ్వేల్ రూరల్ మండలంలోని అహ్మదిపూర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 1989–90లో పదో తరగతి పూర్వ విద్యార్థులు ఆదివారం ఓ ప్రైవేట్ హాల్‌లో ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ఆనాటి గురువులను సన్మానించారు.

వరిని ఆశిస్తున్న ఎండాకు తెగులు

● యాజమాన్య పద్ధతులు చేపట్టాలి
● ఏఓ జయంత్ కుమార్


తెగులు సోకిన వరిని పరిశీలిస్తున్న శాస్త్రవేత్తలు

చిన్నకోడూరు(సిద్దిపేట): వాతావరణ మార్పుల కారణంగా వరి పంటకు ఎండాకు తెగులు ఉధృతి అధికంగా ఉందని, దీని నివారణకు సకాలంలో యాజమాన్య పద్ధతులు పాటించాలని మండల వ్యవసాయశాఖ అధికారి జయంత్ కుమార్ పేర్కొన్నారు. ముందస్తుగా యాజమాన్య చర్యలు చేపడితే అరికట్టవచ్చని సూచించారు.

తెగులు సోకడానికి కారణాలు

సెప్టెంబర్– అక్టోబర్‌లో కురిసే వర్షాలు, తక్కువ ఉష్ణోగ్రతల కారణంగా వరిలో ఎండాకు తెగులు ఆశించడానికి దోహదం చేస్తాయి. నారుమడి దశ నుంచి గింజ పాలుపోసుకునే దశ వరకు తెగులు ఆశించే అవకాశం ఉంటుంది. చెట్టు నీడ పడే ప్రదేశంలో ఎక్కువగా ఎండాకు తెగులు ఆశించి మిగిలిన పంటకు వేగంగా వ్యాపిస్తుంది.

తెగులు గుర్తించే విధానం

వరి పంటలో ఎండాకు తెగులు సోకిన ప్రదేశంలో ముందుగా ముదురు ఆకులకు పసుపురంగు మచ్చలు ఏర్పడి పైనుంచి కింది ఆకుల వెంబడి వ్యాపించి ఎండుతూ వస్తాయి. ఉదయం సమయంలో గమనిస్తే ఆకుల మీద పసుపురంగు జిగురు ముద్దలు కనబడతాయి. ఎండ వేడిమికి గట్టిపడి రాలిపోతాయి. ఈ ఎండిన బాక్టీరియా ముద్దలు నీటి ద్వారా వెళ్లి మిగిలిన పంటకు వ్యాపిస్తుంది.

నివారణ చర్యలు



బాక్టీరియా వ్యాప్తి నివారణకు తెగులు సోకిన మొక్కల నుంచి ఆరోగ్యకరమైన పంటకు నీరు పారకుండా చూసుకోవాలి. తెగులు ఆశించిన పొలంలో నత్రజని వేయొద్దు. కాపర్ ఆక్సిక్లోరైడ్ 30గ్రాములు, ప్లాంటోమైసిన్ 4గ్రాములు 10లీటర్ల నీటిలో కలిపి 2నుంచి మూడు సార్లు వారం వ్యవధిలో పిచికారీ చేసుకోవాలి.

– జయంత్ కుమార్, ఏఓ

సంక్షిప్త వార్తలు

◆ అండగా ఉంటాం..



మర్కూక్(గజ్వేల్): మృతుల కుటుంబ సభ్యులకు అండగా ఉండి ఆదుకుంటామని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు తాండ కనకయ్యగౌడ్, మాజీ సర్పంచ్ తిరుమల్‌రెడ్డి చెప్పారు. మండలంలోని పాములపర్తి గ్రామానికి చెందిన బాలమణి, శార్దిని ఇటీవల అనారోగ్యంతో మృతి చెందారు. విషయం తెలుసుకొన్న వారంతా ఆదివారం మృతుల కుటుంబ సభ్యులను పరామర్శించి ఆర్థిక సహాయం అందజేశారు. కార్యక్రమంలో నాయకులు కాత్రికుమార్, రాజయ్య, కిషన్, లక్ష్మణ్, కిష్టయ్య, చంద్రం, అశోక్, నాగరాజు, యాదయ్య, శేఖర్ పాల్గొన్నారు

◆ రైల్వేబ్రిడ్జి పనుల్లో నాణ్యత లోపం

గజ్వేల్‌రూరల్: గజ్వేల్ నుంచి చేగుంట వెళ్లే రోడ్డు మార్గంలోధర్మారెడ్డిపల్లి దగ్గర రైల్వేబ్రిడ్జి మరమ్మతు పనులను వెంటనే పూర్తి చేయాలని బీజేపీ మండల అధ్యక్షుడు అశోక్‌గౌడ్, పట్టణ అధ్యక్షుడు మనోహర్ డిమాండ్ చేశారు. ఆదివారం గజ్వేల్‌లో వారు మాట్లాడుతూ బ్రిడ్జి కింద చేపట్టిన పనుల్లో నాణ్యత లోపించడం వల్లే ఇనుప రాడ్లు పైకితేలాయని వాపోయారు. వెంటనే అధికారులు స్పందించి పనులు పూర్తి చేయాలని కోరారు.

◆ 6న రెడ్డి ప్రజా ప్రతినిధుల సన్మాన సభ

బెజ్జంకి(సిద్దిపేట): హైదరాబాద్‌లోని శిల్పకళా వేదికలో రెడ్డి జేఏసీ ఆధ్వర్యంలో అక్టోబర్ 6న నిర్వహించనున్న సన్మాన సభకు సంఘ సభ్యులు అధిక సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని జేఏసీ అధ్యక్షుడు మల్లికార్జున్‌రెడ్డి పిలుపునిచ్చారు. మండలంలోని పలు గ్రామాల్లో సన్మాన సభ ఆహ్వాన పత్రికలను ఆదివారం సంఘ సభ్యులకు అందజేశారు. రెడ్డి జేఏసీ నాయకులు తిరుపతిరెడ్డి, లక్ష్మారెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, సుధాకర్‌రెడ్డి, కొండాల్‌రెడ్డి, లింగారెడ్డి పాల్గొన్నారు.

◆ 5న కిసాన్ సంఘ్ రాష్ట్ర మహాసభ



మర్కూక్(గజ్వేల్): భారతీయ కిసాన్ సంఘ్ రాష్ట్ర మహాసభకు రైతులు భారీగా తరలివచ్చి విజయవంతం చేయాలని సంఘ్ మండల అధ్యక్షుడు చిలుక రామచంద్రం పిలుపునిచ్చారు. మండలంలోని గంగాపూర్– యూసఫ్‌ఖాన్‌పల్లి పంచాయతీలో ఆదివారం ఆయన రైతులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వచ్చే నెల 5న కామారెడ్డిలో నిర్వహించే రాష్ట్ర మహాసభకు పార్టీలకు అతీతంగా రైతులు అధిక సంఖ్యలో తరలిరావాలని కోరారు. కృష్ణ, రమేశ్, రవి, రుక్మయ్య, అనిల్, బాల్‌రాజు పాల్గొన్నారు

◆ నాటి కవులు సమాజానికి స్ఫూర్తి

గజ్వేల్‌రూరల్: సమాజంలో నెలకొన్న కులవివక్ష, అంటరానితనం నిర్మూలనకు కృషిచేసిన ఎంతో మంది ఆనాటి కవులు నేటి సమాజానికి స్ఫూర్తి దాయకమని సామాజిక సమరసత వేదిక రాష్ట్ర కన్వీనర్ అప్పాల ప్రసాద్ పేర్కొన్నారు. సమరసత సాహితి పక్షోత్సవాల సందర్భంగా సరస్వతి శిశు మందిర్‌లో శనివారం రాత్రి నిర్వహించిన కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గౌతమ బుద్ధుడి సిద్ధాంతాలను అంబేడ్కర్ ఆచరించారని గుర్తు చేశారు. ఈ సందర్భంగా వేదిక రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ ఆకుల నరేశ్ బాబు పలువురు కవులను సన్మానించారు. కార్యక్రమంలో సాయినాథ్‌రెడ్డి, సందీప్, సత్యనారాయణ, కవులు, కళాకారులు పాల్గొన్నారు.

◆ తైక్వాండో బెల్టుల అందజేత



సిద్దిపేటకమాన్: తైక్వాండో కలర్ బెల్ట్ ప్రమోషన్ టెస్టులో ప్రతిభ చూపిన వారికి వివిధ రకాల బెల్టులు అందజేసినట్లు ఉపాధ్యక్షుడు డాక్టర్ రామ్మోహన్ తెలిపారు. తైక్వాండో అసోసియేషన్ ఆధ్వర్యంలో సిద్దిపేట ఐఎంఏ హాల్‌లో ఆదివారం నిర్వహించిన ఈ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ తైక్వాండో నేర్చుకోవడం వల్ల మానసిక ఒత్తిడి నుంచి విముక్తి లభిస్తుందన్నారు. కార్యక్రమంలో విశ్వనాథం, రామకృష్ణ, శ్రీనివాస్ పాల్గొన్నారు.